క్లుప్తంగా

వీహెచ్‌పీ మండల కార్యవర్గం


వీహెచ్‌పీ మండల కమిటీ సభ్యులు

గాలివీడు: విశ్వ హిందూ పరిషత్ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎంపిక చేశారు. స్థానిక కోదండ రామాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మండల అధ్యక్షుడిగా బుక్కపట్నం హరి, ఉపాధ్యక్షుడిగా ఎన్.ఇరగం రెడ్డి, కార్యదర్శిగా పి.నాగభూషణం, కోశాధికారిగా కె.పెంచలయ్య, గో రక్షక్‌గా శ్రీనువాసులు, సహాయ కార్యదర్శిగా బాల యోగి, భజరంగ్ దళ్ సభ్యులుగా సి.భాస్కర్, కిరణ్ కుమార్, పి.జగన్మోహన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు వై.ఎస్.జయసింహ, ఇ.మణికంఠ, నాగరాజు, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

నల్లగంగమ్మ ఆలయం కిటకిట


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సంబేపల్లి: మండలంలోని దేవరరాయి నల్ల గంగమ్మ ఆలయంలో అర్చకులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయం ముందు భాగంలో బీజాక్షరాలతో ఉన్న మహిమగల రాయికి భక్తులు పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు.

12వ పీఆర్సీని ప్రకటించాలి


మాట్లాడుతున్న చిన్న రెడ్డెన్న

రాయచోటి అర్బన్: ప్రభుత్వం 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, డీఏ అరియర్స్ విడుదల చేయాలని ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పి.చిన్న రెడ్డెన్న డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జీవో సభా భవనంలో పెన్షనర్స్ సంఘం సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిన్నరెడ్డెన్న మాట్లాడుతూ ప్రభుత్వం తమకు ఆదాయపు పన్ను రాయితీ కల్పించడంపై హర్షం వెలిబుచ్చారు. ఈ సమావేశంలో చంగల్‌రెడ్డి, బీవీ.రమణ, పీ.ఈశ్వరయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బండపల్లెలో మాజీ ఎమ్మెల్యే

రామాపురం: మండలంలోని బండపల్లెకు చెందిన కల్లూరి అన్వర్‌బాషా కుమార్తె వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వైస్ ఎంపీపీ రవిశంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మురళీరెడ్డి, రవీంద్రరెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి స్థానిక నాయకులతో మాట్లాడారు.

రామాలయం ప్రారంభానికి ఏర్పాట్లు


గ్రామస్తులతో సమావేశమైన అధికారులు

సిద్దవటం: మండలంలోని లింగంపల్లె, కడపాయపల్లె గ్రామాల మధ్య నూతనంగా నిర్మించిన కోదండరాయాలయం ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్ తెలిపారు. ఆలయం వద్ద ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 13, 14, 15వ తేదీలలో ఆలయంలో జరిగే విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలకు గ్రామ పెద్దలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జునప్రసాద్, కడప, రాజంపేట డివిజనల్ ఇన్స్‌పెక్టర్లు శివయ్య, జనార్దన్, గ్రామ పెద్దలు, పోలీసులు పాల్గొన్నారు.

అగ్రగామి దేశంగా భారత్


విజయోత్సవ సభలో మాట్లాడుతున్న నాగోతు రమేష్ నాయుడు

నందలూరు: దేశ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా భారత్ మారబోతుందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు అన్నారు. డిల్లీ ఎన్నికల్లో బీజేపీ విజయంతో అరవపల్లి ఆర్‌అండ్‌బీ అతిథి గృహం సమీపంలో కూటమి నాయకులు ఆదివారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షబ్బీర్ అహ్మద్, పోతురాజు మస్తానయ్య, హిమగిరినాథ్ యాదవ్, జయచంద్రారెడ్డి, ఆర్ముగం విశ్వనాథ్, చామంచి పెంచలయ్య, మోడపోతుల రాము, మౌలా, గురివిగారి వాసు, కె శ్రీహరి, ఆకుల చలపతి తదితరులు పాల్గొన్నారు.

మాన్యం అన్యాక్రాంతం

కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు దేవాదాయ, ధర్మాదాయ శాఖకు సంబంధించిన భూములపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. పెద్ద, చిన్న తేడా లేకుండా అన్ని ఆలయాల్లోనూ మాన్యం అన్యాక్రాంతం, భూ వివాదాలపై జిల్లా వ్యాప్తంగా అధికారులకు పలువురు దరఖాస్తులు సమర్పించారు. దేవుడి ఆస్తులకు రక్షణ కల్పించాలనే వాదన అన్నింటా వ్యక్తమవుతోంది.

- అన్యాక్రాంత ఆలయ భూములపై ఫిర్యాదుల వెల్లువ
- స్వాధీనం చేసుకోవాలంటూ దరఖాస్తుల సమర్పణ


కలికిరిలో దేవాలయ భూమిని సర్వే చేస్తున్న అధికారులు

రైల్వేకోడూరు అర్బన్: జిల్లా వ్యాప్తంగా రైల్వేకోడూరు, రాజంపేట, పీలేరు, రాయచోటి, మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి నియోజకవర్గాలలో నిర్వహించిన సదస్సులకు దరఖాస్తులు పోటెత్తాయి. అన్నమయ్య జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఉన్న వందలాది ఎకరాల చిన్న ఆలయాలకు చెందిన ఎకరా, అర ఎకరా భూములను చలా మంది పెత్తందారులు ఆక్రమించుకుని స్వాధీనం చేసుకుంటున్నారు. కోట్ల రూపాయల విలువ కలిగిన భూములు ఖద్దరు అండతో వారి గుప్పెట్లో పెట్టుకొని అనుభవిస్తున్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 5062 ఎకరాలకు 345 దరఖాస్తులు అధికారులకు సమర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారులు ఈ దరఖాస్తులను పరిశీలించి దేవుడి మాన్యాలకు ధర్మం చేస్తారా అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. ఏళ్లుగా ప్రజలు తమ వ్యక్తి గత సమస్యలపై కాళ్లరిగేలా తిరిగితే పరిష్కారం కాకపోగా.. ఇపుడు దేవుడు ఆస్తులకు రక్షణ ఉంటుందా అనే ప్రశ్న వారిలో వ్యక్తమవుతోంది.

రెవెన్యూ సదస్సులలో సమర్పించిన దరఖాస్తులు, భూముల వివరాలు(ఎకరాల్లో)

నియోజకవర్గం	దరఖాస్తులు	ఆలయ భూములు
రైల్వే కోడూరు	69	1,087
రాయచోటి	76	1,305
రాజంపేట	53	290
మదనపల్లి	26	249
పీలేరు	76	843
తంబళ్ళపల్లి	45	1,288

ఆలయ భూములు కాపాడాలి



సనాతన ధర్మాన్ని భారత దేశ హిందూ సంస్కతిని కాపాడాలంటే మనకు ఆలయాలు పట్టుగొమ్మలు. ఇందుకోసం దశాబ్దాల ముందు మన పూర్వీకులు ఇచ్చిన ఆలయ భూములు, ఆస్తులను కాపాడుకోవాలి. అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.
– పిడతల రామ్మోహన్‌శర్మ, రైల్వే కోడూరు బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు

ఆలయాల మనుగడ దెబ్బతీయొద్దు



దేవాలయాల మనుగడను దెబ్బతీయొద్దు. మన పూర్వీకులు ఇచ్చిన ఆలయ మాన్యాలు, భూములు దేవాలయాలకే దక్కాలి. వాటిని కాపాడుకోకపోతే భవిష్యత్తులో ఆలయాల మనుగడ దెబ్బతింటుంది. ప్రభుత్వం కాపాడే చర్యలు చేపట్టి దేవాలయాలను కాపాడాలి.
–శ్రీనివాసులునాయుడు, వీహెచ్‌పీ విభాగ కార్యదర్శి, రాజంపేట

ఆక్రమిస్తే చర్యలు తప్పవు



జిల్లాలో ఆలయ భూములను ఆక్రమించినట్లు తేలితే చర్యలు తప్పవు. రెవెన్యూ సదస్సులలో ప్రతి మండలానికి అధికారులు వెళ్లి ఫిర్యాదులు స్వీకరించారు. భూ సమస్యలు పరిష్కరించుకోవడానికి సదస్సులు ఎంతో ఉపయోగపడ్డాయి. అన్యాక్రాంత భూములు స్వాధీనం చేసుకుంటాం. **– సి.విశ్వనాథ్, అన్నమయ్య జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్**

14 నుంచి కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన


మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

రాయచోటి అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను ప్రజలు తిరస్కరించాలని వామపక్షాల నాయకులు పి.శ్రీనివాసులు, పీఎల్.నరసింహులు, మావులూరి విశ్వనాథ్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో విలేకరులతో వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. కొనుగోలు శక్తి కోల్పోతున్న పేదలను ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం సంపన్నులకు రాయితీలు ప్రోత్సహిస్తోందన్నారు. ఆహార రాయితీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమం తదితరాలపై ఈ ఏడాది కేటాయింపులు తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను ప్రజలకు వివరించాలని వామపక్ష పార్టీలు నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


ప్రధానోపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

సిద్దవటం: పూర్వ విద్యార్థులు అందరూ ఒకచోట చేరడం సంతోషకరమని పూర్వ సిద్దవటం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శేషగిరిరావు అన్నారు. సిద్దవటం జెడ్పీ పాఠశాలలో ఆదివారం 1987–88 బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం జరిగింది. 38 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు కలుసుకోవడంతో ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ ప్రధానోపాధ్యాయుడు శేషగిరిరావు మాట్లాడుతూ తన తోటి ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పడంలో బాగా సహకరించారన్నారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన విద్య ఉండేదని, ఎందరో విద్యార్థులు ప్రయోజకులై గొప్ప పదవుల్లో ఉన్నారన్నారు. ప్రస్తుతం విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులతో సెల్‌ఫోన్, ఇంటర్నెట్‌లకు విద్యార్థులు అలవాటు పడిపోయారన్నారు. అనంతరం పూర్వ, ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలకు వేయి లీటర్ల వాటర్ ట్యాంకు అందజేశారు. బాలగురివిరెడ్డి, సిద్దారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గీతాపారాయణం.. పుణ్యదాయకం

ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి


గీతా పారాయణంలో ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్: గీతాపారాయణం చేయడం ఎంతో పుణ్యదాయకం, పుణ్యఫలమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. మండలం లోని ఆకేపాటి ఎస్టేట్‌లో ఎమ్మెల్యే ఆకేపాటి, జ్యోతమ్మ దంపతులు ఆదివారం శ్రీకృష్ణ భగవద్గీతలోని 18 అధ్యాయాలను పారాయణం చేయించారు. అంతకు ముందు స్వామికి కుంకుమార్చన, పుష్పార్చన జరిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆకేపాటి అనిల్ కుమార్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ఆకేపాటి శ్రీకృష్ణ పరమాత్మ భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గడికోట వేంకటసుబ్బారెడ్డి, అనంతపల్లి రామచంద్రయ్య, వేంకటరెడ్డి, సుబ్బారెడ్డి, రమాదేవితో శ్రీకృష్ణ పరమాత్మ భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

పార్వతి, ధ్వజ, గణపతి విగ్రహాలకు పూజలు


అలంకరణలో గణపతి, పార్వతి అమ్మవారు

రామాపురం: మండలంలోని పాదమేదరపల్లె బండపై వెలసిన మరకతలింగ శివాలయంలో పార్వతి, గణపతి విగ్రహాలకు ధాన్యాధివాసం, శయ్యాధివాస పూజలు ఆదివారం ఘనంగా జరిపారు. విగ్రహాల ప్రతిష్ఠలో భాగంగా ముందుగా కలశ పూజ, గర్తిపూజ, మహా స్నపనం హోమాలు చేశారు. 180 కలశాలతో సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలు కలిపి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కడప, హైదరాబాద్‌కు చెందిన ఆలయానికి విగ్రహ దాతలు రాధాక్రిష్ణ, విజయలక్ష్మి, శివశంకర్, ఇందిరా, జనార్దన్, బాలు, లత, శ్రీనివాసులు, లక్ష్మికళలు ధ్వజ, పార్వతి మహాగణపతి, మూలవరులు, రాతి విగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్నారు. రవి ఆధ్వర్యంలో కోలాటం, చెక్క భజన, భక్తి సంకీర్తనలు అందరినీ అలరించాయి. గ్రామస్తులు అన్నదానం చేశారు.

మృతుల కుటుంబీకులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ


రామిరెడ్డికి నివాళులర్పిస్తున్న మోహన్‌రెడ్డి

రామాపురం: మండలంలోని కొండావాండ్లపల్లెకు చెందిన రామిరెడ్డి ఇటీవల మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి మృతుడి స్వగృహానికి చేరుకొని కుటుంబీకులను ఆదివారం పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామిరెడ్డి పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయనతోపాటు మాజీ ఎంపీపీ గడికోట ప్రభాకర్‌రెడ్డి, పెద్దిరెడ్డి, సర్పంచ్ భూషన్‌రెడ్డి, యువజన విభాగం జనరల్ సెక్రటరి వెంకటసుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి, సహదేవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ టీచర్ మృతికి...

సంబేపల్లి: మండలంలోని దేవపట్ల ఆవులవాండ్లపల్లెలో అంగన్వాడీ టీచర్ కవిత చేసిన సేవలు మరవలేనివని మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ నాగశ్రీలక్ష్మి పేర్కొన్నారు. టీచర్ కవిత మృతదేహాన్ని ఆదివారం వారు సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబీకులకు తమ సంతాపం తెలిపారు.

ఏపీఎండీసీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

ఓబులవారిపల్లె: ఏపీఎండీసీ సంస్థలో పదేళ్లుగా పని చేస్తున్న అవుట్ సోర్సింగ్, ట్రైనీ కార్మికులను రెగ్యులర్ చేయాలని, లేని పక్షంలో పోరాటాలకు సిద్ధమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.చంద్రశేఖర్ అన్నారు. ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అనుబంధ కమిటీల సర్వసభ్య సమావేశం రైల్వేకోడూరు ఎన్జీఓ హోమ్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుప్పాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గనుల విస్తరణలో భాగంగా ఇల్లు, భూములు కోల్పోయిన నిర్వాసితుల కుటుంబాలకు చెందిన ఉద్యోగులు సంవత్సరాలుగా ట్రైనీ, అవుట్ సోర్సింగ్ కార్మికులుగా పనిచేస్తున్నారన్నారు. వారి శ్రమను యాజమాన్యం దోపిడీ చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎ.రామాంజులు, పి.జాన్ ప్రసాద్, ఓబుల్, పెంచలయ్య, లక్ష్మీకర్, టి.ఆనంద్, నారద సుబ్బరాయుడు, వెంకటేష్, ఎం శ్రీనివాసులు, మర్రి శంకరయ్య, వెంకటరమణ, గల్లా చలపతి, రహమతుల్లా, సుబ్బరాయుడు, డప్పు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి


మంత్రికి వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

రాయచోటి టౌన్: వాల్మీకి బోయలను ఎస్టీలలో చేర్చాలని రాష్ట్ర వాల్మీకీ సేవా సంఘం అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని శుక్రవారం ఆయన కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సత్యపాల్ కమిషన్ వాల్మీకి బోయలపై అధ్యయనం చేసి నివేదికను సీఎం చంద్రబాబు నాయుడుకు పంపారని గుర్తుచేశారు. ఈ సమస్యను పార్లమెంట్‌లో లేవనెత్తి పరిష్కరించాలని కోరగా, స్పందించిన మంత్రి మండిపల్లి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మండ్ల జయశంకర్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, వాల్మీకి మేకల శివప్రసాద్, జిల్లెల అంజనాదేవి, ముద్దల చిన్న నరసింహులు, ప్రమీల, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు అశోక్, మల్లికార్జున, సురేంద్ర, శ్రావణ్, నారాయణ, బాలు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య, రక్తదాన శిబిరానికి స్పందన


రక్తదానం చేస్తున్న యువకులు

నందలూరు: అల్ హాది వెల్ఫేర్, హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కువైట్ ప్రవాస నందలూరు యువత సహకారంతో స్థానిక బస్టాండు సమీపంలో ఆదివారం మెగా వైద్య, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆ సంస్థ చైర్మన్ మహమ్మద్ ఇబ్రహీం, అన్నమయ్య జిల్లా ప్రెసిడెంట్ సయ్యద్ నజీర్, జిల్లా సలహాదారుడు షేక్ కరీముల్లా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ వైద్య శిబిరంలో 250 మంది రోగులకు పరీక్షలు చేశారని తెలిపారు. నిర్వహించడం జరిగిందన్నారు. దాదాపు 55 మంది రక్తదానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలు వైద్యులు డాక్టర్ జహంగీర్, డాక్టర్ ఆసిఫ్, సయ్యద్ ఫరూక్ హుస్సేన్, డాక్టర్ జయభాస్కర్‌రావు, మస్తానమ్మ, డాక్టర్ కాలేషా, నందలూరు ఉప సర్పంచ్ ఇబ్బు, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

500 మందికి కంటి అద్దాల పంపిణీ


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పుల్లంపేట: పుల్లంపేట ఎస్‌బీవీడీ సభా హైస్కూల్ నందు ముక్కారూపానందరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పలువురికీ కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 500 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 160 మందికి కంటి శస్త్ర చికిత్స చేసేందుకు తిరుపతి అరవింద ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్, ముక్కా సాయివికాష్ రెడ్డి, ముక్కా వరలక్ష్మీ, ముక్కా విశాల్ రెడ్డి, ముక్కా శిరీషా రెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అరటితోట పరిశీలన

పుల్లంపేట: మండలంలోని టి.కమ్మపల్లి సమీపంలో రైతు పసుపులేటి రవికుమార్‌కు చెందన ఏడెకరాల అరటి తోట ఆదివారం విద్యుదాఘాతంతో దగ్ధమైంది. దాదాపు రూ.20 లక్షల మేర పంట నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపారు. ఆదివారం సాయంత్రం రైల్వేకోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ పంటను పరిశీలించి ప్రభుత్వం ఆదుకునేలా కృషి చేస్తామని తెలిపారు.

కన్యకాపరమేశ్వరీ అమ్మవారికి విశేష పూజలు


కన్యకాపరమేశ్వరీదేవి


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రాయచోటి టౌన్: రాయచోటి కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం పునః ప్రారంభోత్సవం, అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమాలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉదయం ప్రాంతఃకాల పూజలు, చండీ పారాయణం, మహా లింగార్చన, మహాస్నపనం, నవగ్రహ, గణపతి పూజలు, రుద్ర హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం దేవస్థానం నిర్మాణానికి మహాకన్యకాంబ సేవ, మహా బ్రహ్మర్పణసేవ, మహాక్రిష్ణార్ప సేవ, మహాశివార్పణ సేవ, కుసుమపుత్రి సేవలు నిర్వహించారు. అనంతరం రాత్రి పుష్పాది కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా సత్యనారాయణగుప్తా


గ్రంధే సత్యనారాయణను అభినందిస్తున్న సభ్యులు

రాజంపేట టౌన్: రాజంపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా గ్రంధే సత్యనారాయణ గుప్తా ఘన విజయం సాధించారు. పట్టణంలోని అమ్మవారిశాలలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు నిర్వహించారు. గ్రంధే సత్యనారాయణగుప్తకు 213, అన్నం సుబ్బరాయుడుకు 27, ప్రకాష్‌రావుకు 195 ఓట్లు వచ్చాయి. దీంతో సత్యనారయణగుప్తా 18 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఆయన అభిమానులు పూలమాలలతో సత్కరించారు. ఎన్నికల అధికారులుగా తుమ్మలపెంట వేణుగోపాల్, సత్య ప్రకాష్, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, వినోద్, డాక్టర్ చంద్రమోహన్ వ్యవహరించారు. ఆర్యవైశ్య సంఘం ఎన్నికలకు సంబంధించి మొత్తం ఏడు వార్డులుండగా ఆరు వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. 1 వార్డుకు చైతన్య, నాగేంద్ర, విజయభాస్కర్‌గుప్త, 1–ఏ వార్డుకు మునిబాలసుబ్రమణ్యం, రమేష్, వెంకటసురేష్, 2వ వార్డుకు పురుషోత్తం, రవికుమార్, 3వ వార్డుకు మణి, నవీన్, సుబ్రమణ్యం, 4వ వార్డుకు హరిప్రసాద్, వెంకటనరసయ్య, 4–ఏ వార్డుకు శంకర్, సురేష్, వెంకటశివప్రసాద్‌లు నామినేషన్లు వేయడంతో ఎన్నికయ్యారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సుధీర్‌బాబు


సుధీర్‌కుమార్

సిద్దవటం: వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సిద్దవటం గ్రామానికి చెందిన ఎం.సుధీర్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడ ఎన్‌జీఓ హోంలో ఆదివారం వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం రాష్ట్ర ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సుధీర్ కుమార్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సుధీర్‌కుమార్‌బాబు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. కడప జిల్లా ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, ఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు కె.వి.శివారెడ్డి, రాష్ట్ర సెక్రటరీ విద్యాసాగర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించండి

సుండుపల్లె: వాహనదారులు ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలని లేని పక్షంలో జరిమానా, శిక్షలు తప్పవని సుండుపల్లి ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలియజేశారు. మండలంలోని భైరవగుట్ట సమీపంలో ఆదివారం వాహనాలు తనిఖీ చేపట్టారు. రికార్డులు సరిగా లేని వాహన దారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన దారులు రికార్డులను తప్పనిసరిగా ఉంచుకోవాలని, మద్యం తాగి వాహనం నడపడం, హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం, నేరమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

ఓబులవారిపల్లె: మండలంలోని మద్దిపల్లి గ్రామ సమీపంలోని ముళ్ల పొదల్లో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 7700 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.మహేష్‌నాయుడు తెలిపారు. కేసు నమోదు చేశామని తెలిపారు.

స్త్రీల మహా సమాజం ఏర్పాటు

రైల్వేకోడూరు అర్బన్: తిరుపతి జిల్లా నాయుడుపేటలో జరిగిన సమావేశంలో రైల్వే కోడూరు ఎస్‌ఏఎల్‌పీ స్త్రీల మహా సమాజాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక లూథరన్ చర్చికి చెందిన మహిళలతో ఈ సమాజం ఏర్పాటు చేశారు. శాంతమ్మ, మంజుల, మేరీ, రాణి సంయుక్త, కళ్యాణి, సుకేసినీ, జ్యోతి పాల్గొన్నారు.

కుర్చీ కోసం కూటమి నాయకుల కసరత్తు!


రాజంపేట వ్యవసాయ మార్కెట్

రాజంపేట: రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలంలో ప్రొటోకాల్ కలిగిన ఏకైక పోస్టు రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ. ఇప్పుడు ఈ కమిటీ కుర్చీ కోసం బీజేపీ కసరత్తు చేస్తోంది. తొలి సారిగా మార్కెట్ కమిటీ రిజర్వేషన్ దళిత వర్గీయులకు రావడంతో ఆ పోస్టును ఇపుడు బీజేపీ ఆశిస్తోంది. తనకు చైర్మెన్ పోస్టు దక్కేలా చూడాలని మంత్రి సత్యను ఆయన స్నేహితుడు పోతురాజు మస్తానయ్యకు స్వయంగా కలిసి కోరారు. దీంతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిప్రతాప్ అల్లుడు సాయిలోకేష్ , బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతురమేష్ నాయుడుకు మస్తానయ్య సన్నిహితుడవడంతో వీరు చైర్మెన్ పదవి చ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

చైర్మన్, వైస్ చైర్మన్ కావాలంటున్న టీడీపీ

మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు తమకే కావాలని టీడీపీ నేతలు ఉవ్విళ్లూరుతున్నారు. నామినేటెడ్ పదవుల కేటాయింపులో తమదే అగ్రిపీ తమనే భావనలో తమ్ముళ్లున్నారు. రాజంపేటకు ఇన్‌చార్జి లేకపోవడంతో సుగవాసి సుబ్రహ్మణ్యం, చామర్తి జగన్‌మోహన్‌రాజు, మేడా విజయశేఖర్ రెడ్డి నియోజకవర్గంలో కీలకంగా వ్యవహారిస్తున్నారు. ఈ నేతలు ఎవరి పేరు తీసుకొస్తారో తెలియని పరిస్థితి. వైస్ చైర్మన్ పోస్టును కమ్మ సామాజికవర్గ నేతలు ఆశిస్తున్నారు.

వైస్ చైర్మన్ ఇవ్వాలంటున్న జనసేన


మస్తానయ్య,

నియోజకవర్గంలో నామినేటెడ్ పోస్టు ఒకటీ రాలేదన్న ఆవేదన జనసేన నాయకుల్లో ఉంది. ఈ పార్టీ నుంచి బలిజ సామాజికవర్గీయులు పదవిని ఆశిస్తున్నారు. రాజంపేట నియోజకవర్గ ముఖ్య నేత, పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు యల్లటూరు శ్రీనువాసరాజు వైస్ చైర్మన్ పదవిని జనసేన పార్టీకిపనిచేసిన నేత కు ఇప్పించాలనే అంశాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లనున్నారు. ఇప్పుడు మార్కెట్ కమిటీ నియామకం విషయంలో కూటమి మల్లగుల్లాలు పడుతుండటంతో పెండింగ్‌లో పెట్టినట్లు చర్చ జరుగుతోంది.